క్లుప్తంగా

10న మండల సమావేశం

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలోని ఎంపీడీవో కార్యాలయంలో 10వ తేదీన ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు. వెంకటగిరి రూరల్ మండలానికి సంబంధించి తాగునీరు, గ్రామాల్లో చేపట్టాల్సిన మౌలిక అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పథకం పనులు తదితరాలపై సమీక్షించనున్నట్లు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



రాపూరు: రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వద్ద ఉన్న మహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పాలు, తేనె, చందనం, పెరుగు, పంచామృతం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలు, భజనలు చేపట్టారు.

దళితులు, గిరిజనుల సమస్యలపై మంత్రికి వినతి

దక్కిలి: వెంకటగిరి నియోజకవర్గంలో దళితులు, గిరిజనుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రజా సంఘాల అధ్యక్షుడు గద్దల మునెయ్య, మాదిగ ఉద్యోగుల సమైక్య తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య కోరారు. వారు బుధవారం వెలగపూడి సచివాయలంలో హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆమె తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అనంతరం వారు టీడీపీ పొలిటికల్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టరీ ప్రసాద్‌ను కలిసి పలు సమస్యలను వివరించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో కృష్ణయ్య

దొరవారిసత్రం: పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఈవో కృష్ణయ్య ఆదేశించారు. ఆయన బుధవారం ఏకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పిల్లలతో మాట్లాడి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించి అన్నీ శుభ్రంగా ఉంచుకోవాలని వంట నిర్వాహకులను ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు.

40 మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట: అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిళ్లను పోలీసులు బుధవారం కోట క్రాస్ రోడ్డు వద్ద స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరుపల్లికి చెందిన రమణయ్య అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అల్లూరు సీతారామరాజు జయంతిని జరుపుకోవాలి

నాయుడుపేట టౌన్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గురువారం ఉదయం మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయాలతో పాటు వార్డు, గ్రామ సచివాలయాల్లో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా జరుపుకోవాలని కమిషనర్ జనార్దన్ రెడ్డి, ఎంపీడీవో ప్రేమ్‌రాజ్ కుమార్ తెలిపారు. వార్డు సచివాలయల వద్ద వార్డు అడ్మిన్లు, పంచాయతీ కార్యదర్శులు ఆయా సచివాలయల వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలని సూచించారు.

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

నాయుడుపేట టౌన్ : కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన చట్టాలను వ్యతిరేకిస్తూ గురువారం విధులను బహిష్కరించి నిరసన తెలపనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్ తెలిపారు. కొత్తగా ప్రవేశ పెట్టిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సంహిత, భారతీయ సాక్ష్య అదినియం తదితర చట్టాలను మార్పు చేయాలని కోరుతూ తీర్మానం చేసినట్లు వెల్లడించారు. గురువారం న్యాయస్థానంలో విధులకు హాజరుకావడం లేదని ప్రకటించారు. కక్షిదారులు తమకు సహకరించి మద్దతు తెలిపాలని కోరారు.

బడిబాట పట్టని చిన్నారులు







బడి మానేసి గేదె మీద ఎక్కి పశువులను కాస్తున్న బాలుడు, ఇటుకబట్టీల వద్ద మండుటెండలో మగ్గుతున్న వలస కూలీల పిల్లలు, కానూరులో ఇటుకబట్టీల వద్ద గిరిజ కాలనీకి చెందిన బడిఈడు పిల్లలు

- పొలం, వ్యవసాయ పనుల్లో పిల్లలు
- ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వైనం
- తూతూ మంత్రంగా 'నేను బడికి పోతా'
- పట్టించుకోని ఉన్నతాధికారులు

విద్యతో పేదరికాన్ని రూపుమాపొచ్చు. అందుకే పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి చదువు ఒక్కటే అని పెద్దలు చెబుతూ ఉంటారు. 14 ఏళ్లలోపు పిల్లలకు నిర్బంధ ఉచిత విద్య అందించాలని రాజ్యాంగం పేర్కొంది. అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో గ్రామాల్లో నేటికీ ఎక్కువ మంది పిల్లలు బడి బాట పట్టడం లేదు. ముఖ్యంగా గ్రామాల్లో కొందరు కర్ర చేత పట్టుకుని మేకలు, గేదెలు మేపేందుకు వెళుతుండగా మరికొందరు తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనుల్లో సాయం చేస్తున్నారు. ఇంకొందరు ఇటుకబట్టీల్లో శ్రమజీవులుగా మారిపోతున్నారు.

– పెళ్లకూరు

పెళ్లకూరు మండలంలో ఎక్కువ మంది వ్యవసాయ కూలి పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అలాగే గేదెలు, మేకలు, గొర్రెలు మేపుకుంటూ ఉంటారు. ఎక్కువ మంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను తమతోపాటు ఇటుక బట్టీలు, పొలం పనులకు తీసుకెళుతుంటారు.



అర్లపాడు గిరిజన కాలనీకి చెందిన బడి మానేసిన పిల్లలు

మండలంలో 55 అంగన్‌వాతడీ కేంద్రాలు, 8 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 3 నుంచి ఐదేళ్లలోపు పిల్లలు 2,376 మంది ఉన్నారు. అలాగే 57 ప్రాథమిక, 7 ఉన్నత పాఠశాలల్లో 1,682 మంది బాలురు, 1468 మంది బాలికలు చదువుకుంటున్నారు. మండలంలోని అర్లపాడు, కానూరు, చెంబేడు, కొత్తూరు, దిరసనమాల, కప్పగుంటకండ్రిగ, శిరసనంబేడు, పునబాక, బంగారంపేట, నెలబల్లి తదితర గ్రామాల్లోని దళితకాలనీలు, గిరిజన కాలనీల్లో ఎక్కువ మంది వ్యవసాయ కూలి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వచ్చే అరకొర సంపాదన కుటుంబ పోషణకు కష్టంగా ఉంటుందని భావించి పిల్లలను కూడా తమతోపాటు తీసుకెళుతున్నారు. ఎక్కువ మంది తమ పిల్లలను ఆవులు, గేదెలను కాసేందుకు పంపుతున్నారు. దుకాణాలు, హోటళ్ల వద్ద పనులకు పెట్టేస్తున్నారు. అదేవిధంగా కొందరు తల్లిదండ్రులు స్వగ్రామాల్లో పనులు లేకపోవడంతో వలసలు వెళుతున్నారు. వారితో పాటు పిల్లలను కూడా వెంట తీసుకెళుతుండడంతో అక్కడ చదువుకునే పరిస్థితి లేక ఖాళీగా ఉండాల్సి వస్తోంది.

సక్రమంగా అమలుకాని నేను బడికి పోతా

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమం లక్ష్యం నెరవేరకుండానే నీరుకారిపోతోంది. ఉపాధ్యాయులు ఆయా గ్రామాలకు వెళ్లి బడిమానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలి. ప్రతియేటా విద్యా సంవత్సరం ఆరంభంలో విద్యావారోత్సవాలు నిర్వహించి తల్లిదండ్రుల్లో అవగాహన పెంపొందించాలి. అదేవిధంగా నిర్బంధ ప్రాథమిక విద్య, బాలకార్మికుల చట్టాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి ఉంది. అందరూ చదవాలి–అందరూ ఎదగాలి అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య వంతులను చేసి బాలకార్మిక వ్యవస్థ నుంచి విముక్తి చేయాలి. ఇక్కడి ఉపాధ్యాయులు నామమాత్రంగా కార్యక్రమాలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. పాఠశాలలకు కూడా సక్రమంగా హాజరుకావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పట్టించుకోని ఉన్నతాధికారులు

గ్రామీణ ప్రాంతాల్లోని బాలకార్మికులను గుర్తించి వారి భవిష్యత్తుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అందువల్లే ఉపాధ్యాయులు నామమాత్రంగా కార్యక్రమాలను నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

బడికి పంపడం లేదు



మేము గ్రామానికి దూరంగా వ్యవసాయ పొలాల వద్ద నివాసం ఉంటున్నాము. బడికి వెళ్లాలంటే చాలా దూరం నడవాలి. అందువల్ల మా అమ్మావాళ్లు మమ్మల్ని బడికి పంపడం లేదు. రోజు మా అమ్మవాళ్లతో మేకలు మేపుకోవడానికి వెళతాము.

–పవన్, వెంకటరమణయ్య, శిరసనంబేడు గిరిజన కాలనీ

పిల్లలతో పనులు చేయించడం నేరం

14 ఏళ్ల లోపు పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరం. దుకాణాల్లో చిన్నారులను నియమించడం, బడి మాన్పించి పశువుల కాపరులుగా మార్చడంపై పరిశీలిస్తాం. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారిని పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటాం. నేను బడికి పోతా.. కార్యక్రమాన్ని పక్కాగా అమలుచేసేలా చూస్తాం.

– ఎంఈవో శంకరయ్య

కండలేరులో 6.312 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 6.312 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐదు ట్రాక్టర్ల స్వాధీనం



పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ట్రాక్టర్లు

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామ పరిధిలోని చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లు, ఒక యంత్రాన్ని ఎస్‌ఐ తిరుమలరావు స్వాధీనం చేసుకున్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ చెరువులో అక్రమంగా మట్టిని తవ్వుతున్నారని తహసీల్దార్ ప్రసాద్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు అందాయన్నారు. వారి ఆదేశాలతో చెరువు వద్దకు చేరుకున్నట్లు తెలిపారు. గ్రావెల్ తరలించే వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ



డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ అయ్యప్ప

కలువాయి: మండలంలోని ప్రైవేట్ స్కూళ్ల బస్సులను బుధవారం ఎస్‌ఐ అయ్యప్ప తన సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టారు. నెల్లూరు జిల్లా కావలిలో స్కూల్ బస్సు ప్రమాదం జరిగిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. వాహనాల సామర్థ్యాన్ని పరిశీలించారు. కండీషన్‌లో ఉంచుకోవాలని, ఎఫ్‌సీ తదితర పత్రాలు అప్‌డేట్‌గా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులను తీసుకువెళ్లే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సేవాగుణాన్ని అలవరుచుకోవాలి



భక్తులతో మాట్లాడుతున్న పరిపూర్ణానంద స్వామి

నాయుడుపేట టౌన్: ధనార్జనే ధ్యేయం కాకుండా పేదలకు సాయం చేసే గుణాన్ని అలవరుచుకోవాలని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి ప్రబోధించారు. ఆయన బుధవారం రాజమండ్రి బయలుదేరారు. ఆయనకు నాయుడుపేటలోని జువ్వలపాళెం క్రాస్ రోడ్డు వద్ద భక్తులు ఘన స్వాగతం పలికారు. జువ్వలపాళెం అయ్యప్పస్వామి ట్రస్టు చైర్మన్ కొప్పల సుబ్రమణ్యం సారథ్యంలో పాద పూజ చేశారు. స్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించాలన్నారు. హిందూ సనాతన ధర్మానికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. స్థానిక ప్రవాస భారతీయులు చిల్లకూరు గోపిరెడ్డి, నర్సింహులు నాయుడు, ఎన్‌సీఆర్, మెంటామల్లి, వరదయ్య ఆచారి, గెరిక సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేస్తున్న మల్లికార్జున్

చిల్లకూరు: తూర్పుకనుపూరులో సాగరమాల రహదారి నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన గిరిజనులకు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో స్థలాలు ఇవ్వాలని గ్రామానికి చెందిన నాయకుడు అన్నాడిశెట్టి మల్లికార్జున్ కోరారు. ఆయన బుధవారం బాధితులతో కలిసి తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గిరిజనులు నివాసం ఉంటున్న ఇళ్లు రోడ్డు నిర్మాణంలో పోయాయన్నారు. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో వారికి కొంత కేటాయిస్తే పూరిళ్లు వేసుకుని జీవనం సాగిస్తారని కోరారు. ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేస్తే అక్కడికి వెళతారని వివరించారు. స్పందించిన తహసీల్దార్ బాధితులకు స్థలం చూపించాలని వీఆర్వో జగదీష్‌ను ఆదేశించారు.

లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

చిల్లకూరు: సాగరమాల రోడ్డు పనులకు మట్టిని తరలిస్తున్న లారీలను బుధవారం కొమరావారిపాళెం గ్రామస్తులు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ టిప్పర్లు సుమారు 50 టన్నులకు తక్కువ లేకుండా మట్టిని తీసుకెళుతున్నాయన్నారు. రాత్రిళ్లు సైతం ఇళ్ల మధ్య అతివేగంగా వెళుతుండడంతో ఆ శబ్దాలకు చిన్న పిల్లలు భయాందోళన చెంది నిద్ర నుంచి ఉలిక్కపడి లేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండు పర్యాయాలు లారీలను నిలిపివేశామని తెలిపారు. సాగరమాల రోడ్డు నిర్వహణ సంస్థ ప్రతినిధులు తమ ప్రాంతంలో రెండు రోజులు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసి టిప్పర్లు నిదానంగా వెళ్లేలా చూశారని తెలిపారు. తర్వాత యధావిధిగా లారీలు వెళుతున్నాయని వాపోయారు. అంతేగాక మట్టిని తరలించే సమయంలో లారీలపై పట్టలు కట్టకపోవడంతో మట్టి, గ్రావెల్ రోడ్డుపై పడుతోందని తెలిపారు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇకనైనా సాగరమాల ప్రతినిధులు, అధికారులు భారీ టిప్పర్లను కట్టడి చేసేలా చూడాలని వారు కోరారు.

ఆర్‌వో వాటర్ ప్లాంట్ ప్రారంభం



తాగునీటి పథకాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం తదితరులు

నాయుడుపేట టౌన్: మండలంలోని మాబాక గ్రామంలో ఇండస్ కాఫీ పరిశ్రమ సౌజన్యంతో రూ.7.5 లక్షలతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను బుధవారం మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం ప్రారంభించారు. నెలవల మాట్లాడుతూ నియోజవర్గంలోని మేనకూరు, శ్రీసిటీ, మాంబట్టు తదితర సెజ్‌లలో ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించడం లేదన్నారు. సీఎస్‌ఆర్ నిధులను ప్రజా సంక్షేమానికి పూర్తి స్థాయిలో వినియోగించడం లేదన్నారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని పేర్కొన్నారు. మాబాకలో సీఎస్‌ఆర్ నిధులతో తాగునీటి పథకం ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. పరిశ్రమ డైరెక్టర్‌లు నందీష్ రవిగౌడ, హెచ్ఎస్ టారాప్టర్, నాయకులు షేక్ రఫీ, శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, కట్టా వెంకటరమణారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

చేపల అక్రమ వేటపై విచారణ



మత్స్య సహకార సంఘం సభ్యుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకుంటున్న ఏడీ శ్రీనివాసులు

కలువాయి: కలువాయి చెరువులో అక్రమంగా చేపలు పడుతున్నట్లు అందిన ఫిర్యాదుపై మత్స్యశాఖ కావలి ఏడీ శ్రీనివాసులు బుధవారం విచారణ జరిపారు. కలువాయి చెరువులో మత్స్య సంపదను కొందరు అక్రమంగా పడుతున్నారని చెరువు మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు వజ్రాల శ్రీనివాసులు, సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు కావలి ఏడీ శ్రీనివాసులును ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏడీ శ్రీనివాసులు బుధవారం కలువాయిలో సొసైటీ సభ్యులను విచారించారు. వారి నుంచి లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చేపల వేటపై కలువాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు వివరించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ చౌడయ్య

దక్కిలి: తెలుగు గంగ కాలువ పరివాహక ప్రాంతాల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ చౌడయ్య తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం తెలుగుగంగ కాలువలో నీరు ప్రవహించడం లేదన్నారు. ఈ క్రమంలో కాలువ కింద భాగంలో ఉన్న పొలాల వద్ద ఉన్న మోటార్లను దొంగలు చోరీ చేసే అవకాశం ఉందన్నారు. రైతులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. పంటలు సాగు చేసేటప్పుడు మాత్రమే మోటార్లను బిగించుకోవాలని చెప్పారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో హుండీలపై గ్రామ ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. హుండీల్లో ఉన్న నగదును భద్రపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భారతీయ నాగరిక్ సురక్ష, భారత సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినీయమ్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.


నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



ప్రయాణికులు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సుధీర్‌కుమార్

చిల్లకూరు: ప్రజలు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం మండలంలోని జాతీయ రహదారిలోని వరగలి క్రాస్ రోడ్డులో ద్విచక్రవాహనదారులు, లారీ డ్రైవర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ న్యాయాన్ని నిర్ధారించడం, నమ్మకాన్ని పెంచడంతోపాటు ప్రతి పౌరుడికీ న్యాయం అందించేందుకు ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకువచ్చిందన్నారు. వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ఎవరైనా మృతికి కారణమైతే 10 ఏళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. వాహనాలను నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు సామగ్రి పంపిణీ



గూడూరు రూరల్: గూడూరు మున్సిపాలిటీలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం యూనిఫాం, గ్లౌజులు, సామగ్రిని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ఎంఈవోను కలిసిన బీటీఏ నాయకులు

దొరవారిసత్రం: ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీటీఏ ఉపాధ్యాయుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారు బుధవారం మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించాలన్నారు. జీవో నంబర్ 117ను రద్దు చేసి 3, 4, 5 తరగతులను ప్రైమరీ పాఠశాలల్లో కలిపి ప్రాథమిక విద్యను కాపాడాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాన్నారు. అనంతం ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాని వినతి పత్రాన్ని స్థానిక ఎంఈవో కృష్ణయ్య అందజేశారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు మునస్వామి, శేషయ్య, రవి, శ్రీనివాసులు, నాగరాజు, వినయ్‌కుమార్, దొరబాబు, సతీష్ పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.13.42 లక్షలు



హుండీల్లోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

వెంకటగిరి రూరల్: వెంకటగిరి గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలోని హుండీల నుంచి రూ.13,42,513 ఆదాయం వచ్చినట్టు గ్రూప్ ఆలయాల ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పట్టణంలోని పాతకోట శ్రీరామ మందిరంలో బుధవారం పోలేరమ్మ ఆలయంలోని హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. నాలుగు నెలలకు సంబంధించి రూ.13,42,513 నగదు. 3.500 గ్రాముల బంగారు, 84 గ్రాముల వెండి, 30 యూఎస్ డాలర్లు, 5 కువైట్ దినార్‌లు వచ్చాయని తెలిపారు. స్తంభాల గిరీశ్వరయ్య స్వామి ఆలయ ఈవో ఎన్.శ్రీధర్‌నాయుడు, బ్యాంకు విశ్రాంత అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



కార్జిమేడులో విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేస్తున్న నాయకులు

ఓజిలి: విద్యార్థులు క్రమశిక్షణ అలవరుచుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వైఎస్సార్ సీపీ నాయకుడు ముప్పాళ్ల మోహన్‌రాజు, ఉప సర్పంచ్ వినోద్‌నాయుడు తెలిపారు. మండలంలోని గుర్రంకొండ పంచాయతీ కార్జిమేడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వసతులు ఉన్నాయని తెలిపారు. మెరుగైన విద్యాబోధన అందుతోందన్నారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే ఆర్మేనిపాడులో మాజీ సర్పంచ్ కొండూరు ఈశ్వర్‌రాజు, కొండవల్లిపాడులో మాజీ సర్పంచ్ కొకొళ్ల శేషయ్య విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండూరు సురేష్‌రాజు, టీడీపీ నాయకులు కోటేశ్వర్‌రాజు, పరంధామరాజు, అశోక్‌రాజు, ఉపాధ్యాయులు సురేంద్ర, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



నాయుడుపేటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

నాయుడుపేటటౌన్: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఉపాధ్యాయులు తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని టంగుటూరి ప్రకాశం పంతులు జనరల్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం నేను బడికి పోతా అనే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేటు పాఠశాలకు దీటుగా వసతులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, షూస్, బ్యాగు ఉచితంగా ఇస్తున్నారని పేర్కొన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం వీఎంఎం సత్యశీల, ఉపాధ్యాయులు వి.జ్యోతి, మునిమధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.